నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: రాయదుర్గం లక్ష్మణభాగ్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి యేటా ఆరు రోజులపాటు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. శనివారం నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఈనెల 10వ తేదీ ,రథోత్సవాన్ని 12వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు.

అరుదైన శస్త్ర చికిత్స


మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్ కొగంటి

శేరిలింగంపల్లి: నల్లగండ్ల సిటిజన్స్ ఆస్పత్రిలో రోగికి క్రిటికల్ హార్ట్ సర్జరీ చేసి కాపాడారు వైద్యులు. శుక్రవారం ఆస్పత్రిలో సీనియర్ కన్సల్టెంట్, ప్రఖ్యాత కార్డియాలజిస్ట్ డాక్టర్ సుధీర్ కొగంటి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. 72 ఏళ్ల వృద్ధుడికి ట్రాన్స్ కేథెరటర్ అరోటిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ (టీఏవీఆర్) ద్వారా చికిత్స చేశామన్నారు.కార్డియాక్ కేర్‌లో ఇది ఒక పురోగతి అని పేర్కొన్నారు. చాలా కాలం నుంచి కాలు వాయడం, డయాలసిస్ చేయాల్సిన అవసరం ఉన్నా కిడ్నీ ఫెయిల్యూర్ అయి గుండె సరిగ్గా పని చేయకపోవడంతో రోగికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం కష్టమని సర్జరీ లేకుండా అరోటిక్ వాల్వ్‌ను మార్చే టీఏవీఆర్ ప్రక్రియ మంచి పరిష్కారాన్ని అందించిందన్నారు.

అవగాహన సదస్సు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని శుక్రవారం వైద్యాధికారి రాజ కుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో ఆశా వర్కర్లు, వార్డు ఆఫీసర్లతో కలిసి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీ నుండి మున్సిపల్ పరిధిలోని 1- 19 సంవత్సరాల వయసు లోపు విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వృద్ధులు కూడా ఈ మాత్రలను వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లికార్జున్, ఆర్వో నర్సింలు, వార్డు ఆఫీసర్లు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి


నందమూరినగర్ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నందమూరినగర్ కాలనీలో మంచినీటి వాల్వ్ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. మంచినీటి సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన నందమూరి నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు. కాలనీవాసులందరూ కలిసి కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఇన్‌చార్జి మేనేజర్ ప్రియాంక, వాటర్ లైన్‌మెన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్‌ల పరిధిలో 50 మందికి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు రూ.50,05,800లను శుక్రవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సాగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, బ్రిక్ శ్రీనివాస్, రాజేందర్, మారెళ్ల శ్రీనివాసరావు, పురంధర్‌రెడ్డి, కావూరి అనిల్, ఎల్లం నాయుడు, పోశెట్టి గౌడ్, శ్రావణిరెడ్డి పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం .... శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ. 2 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఒడిశా ఫుడ్, క్రాఫ్ట్ మేళా



హస్తకళా ఉత్పత్తులు, సాంప్రదాయ వంటకాలు, నృత్య ప్రదర్శనలు



ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు

మూడురోజుల పాటు కొనసాగనున్న మేళా

శిల్పారామంలో ఒడిశా ఫుడ్ అండ్ క్రాఫ్ట్ మేళాను బీపీ ఆచార్య ఐఏఎస్, డికె. మహంతి ఎన్ఎండీసీ మాజీ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్ గగన్ బిహారిరౌత్‌లు శుక్రవారం ప్రారంభించారు. స్వాభిమాన్ ఒడియా ఉమెన్స్ వరల్డ్ , శిల్పారామం సంయుక్త నిర్వహణలో ఈ మేళాను ఏర్పాటు చేశారు. ఇందులో ఒడిశా వంటకాలు నోరూరిస్తున్నాయి. అలాగే లేఖ, సింఘూకామ, దోక్రా, ఆర్ట్, పిపిలీ ఆప్లిక్ వర్క్, సంబల్పురి, కోటపాడు, టస్సర్ చీరలు అందుబాటులో ఉన్నాయి. ప్రసిద్ధ సంబల్‌పురి, బొమ్‌కై అల్లికలతో పాటు క్లిష్టమైన పట్టాచిత్ర పెయింటింగ్‌లు దోక్రా మెటల్‌వర్క్ ఆకట్టుకుంటున్నాయి. సాంప్రదాయ వంటకాలైన రసగుల్లా, ఆలూదమ్ తదితర వంటకాలు అందుబాటులో ఉన్నాయి. సాయింత్రం ఒడిస్సీ, జానపద, గిరిజన నృత్య ప్రదర్శనలు, ఒడియా సంగీత కచేరీతో అలరించారు. కార్యక్రమంలో స్వాభిమాన్ ఒడియా ఉమెన్స్ వరల్డ్ సభ్యులు రీనాదాస్ తదితరులు పాల్గొన్నారు. దెబశ్రీ పట్నాయక్ శిష్యబృందం ఒడిసీ నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు.

– మాదాపూర్








నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్ రంగారెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంజయ్యనగర్, రాజరాజేశ్వరి కాలనీ, హఫీజ్‌పేట్ బ్లాక్ బి, ప్రేమ్‌నగర్, మార్తాండనగర్, క్రాంతివనం, కొత్తగూడ, కొండాపూర్ 8వ బెటాలియన్ ప్రాంతం , ఖానామేట్ ముస్లిం బస్తీ వంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చందానగర్‌లో..

చందానగర్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో.. విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్ కాలనీ, వార్డు కార్యాలయం, గ్రీన్ బావర్చి ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ఆదిత్యానగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 వరకు ఆదిత్యానగర్, ఎస్‌సీబి కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ప్రాంతాలలో..

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

- సురక్షా ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యానగర్, సురక్షా ఎన్‌క్లేవ్, సురక్షా హిల్స్, శుభోదయ కాలనీ, పద్మజ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, అపర్ణ హెచ్‌టీ సర్వీస్ ప్రాంతాలలో ..
- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి 11.30 గంటల వరకు ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్ తదితర ఏరియాలలో..
- కెఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 12.30 గంటల వరకు కెఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్, పీజేఆర్ రోడ్డు నెంబర్ 2,4,6,8 తదితర ప్రాంతాలలో ..
- పీజేఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 13.30 గంటల నుంచి 2.00 గంటల వరకు పీజేఆర్ ఎన్‌క్లేవ్ ఏరియాలో..

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో....

- ఆదిత్యా ఇంపీరియల్ హైట్స్, మార్తాండనగర్ ఫీడర్ల పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఆదిత్యా ఇంపీరియల్ హైట్స్, మార్తాండనగర్ పూర్తి ఏరియాలలో విద్యుత్ ఉండదని ఏఈ దీప్తి పేర్కొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: 11కేవీ డైమండ్ హిల్స్, గోపన్‌పల్లి ఫీడర్‌ల పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోపన్‌పల్లితండా, డైమండ్‌హైట్స్, జవహర్ నవోదయ స్కూల్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు వివరించారు.

- 11 కేవీ ఎన్‌టీఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గోపన్‌పల్లితండా, ప్రతిమా హిల్స్, ఎన్‌టీఆర్‌నగర్, తాజ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

గచ్చిబౌలిలో..

రాయదుర్గం: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ భాస్కర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జేఎన్‌ఐడీబీ, కేంద్రీయ విహార్, ఏపీహెచ్‌బీ కాలనీ, బ్రహ్మకుమారీ సంస్థ , ఇందిరానగర్, జీపీఆర్ఏ క్వార్టర్స్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని వివరించారు

- 11 కేవీ పీజేఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి 12 గంటల వరకు టెలికామ్‌నగర్ ప్రాంతంలో విద్యుత్ ఉండదన్నారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

'మనూ' వీసీ ప్రొ. ఐనుల్ హసన్


మాట్లాడుతున్న వీసీ ప్రొ. ఐనుల్ హసన్

రాయదుర్గం: నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు, యువత శ్రీకారం చుట్టాలని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో రెండురోజుల జాతీయస్థాయి సదస్సును ఆయన శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో అన్ని విభాగాల మధ్య సమన్వయం పెరగాలన్నారు. విద్యార్థులు వినూత్నంగా ఆలోచించేలా బోధనకు కృషి చేస్తున్నామన్నారు. సమయం, అవకాశం యొక్క విలువను గుర్తించాలన్నారు. హెచ్ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.సి.శర్మ మాట్లాడుతూ తరువాతి తరాన్ని రూపొందించడంలో అధ్యాపకులు కీలకపాత్ర పోషించాలన్నారు. టీఐఎస్ఎస్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ స్టడీస్ చైర్‌పర్సన్ డాక్టర్ రితేష్ మాట్లాడుతూ విద్య అనేది నిరంతర ఆవిష్కరణలను ప్రోత్సహించే చైతన్యవంతమైన రంగమన్నారు. సాంకేతిక పురోగతికి అనుగుణంగా ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు అవసరం అని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.ఇష్తియాక్ అహ్మద్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్, ప్రొఫెసర్ షుగుప్తాషాహిన్, ప్రొ.వనజ, ప్రొఫెసర్ షాహీన్ షేక్, డాక్టర్ సబాఖాతూన్ ప్రసంగించారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించేలా చేయాలి

హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ ప్రొ.సంజయ్ సుభోద్




రాయదుర్గం: చదువుతోపాటు విద్యార్థులు వినూత్నంగా ఆలోచించేలా చేయాలని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ ప్రొఫెసర్ సంజయ్ సుభోద్ సూచించారు. శుక్రవారం హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో మినీ ట్రేడ్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఫెయిర్‌ను తిలకించిన ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన విద్య అందిస్తూనే వారు నైపుణ్యాలు కూడా నేర్చుకునేలా చేయాలన్నారు. విద్యార్థుల ఎగ్జిబిట్లు వారిలోని నైపుణ్యాలను ప్రస్ఫుటం చేస్తున్నాయని ప్రశంసించారు. అంతేకాకుండా ఫుడ్‌స్టాల్స్, పుస్తక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రిన్సిపల్ మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



మియాపూర్: మియాపూర్ దీప్తిశ్రీనగర్ కాలనీలో శాంతినగర్ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు, కంకర తేలిన రోడ్లపై ప్రయాణం నరక ప్రాయంగా మారింది. రోడ్డు మరమ్మతులు చేసినా మరలా గుంతలు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఈవీఎంల గోడౌన్‌ను శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన చేశారు. ఈవీఎంల గోడౌన్‌కు వేసిన సీల్‌లను పరిశీలించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. ఆయన వెంట రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


ఈవీఎం గోడౌన్ వద్ద కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

మణికొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, వారికి అవసరమైన తోడ్పాటును అందిస్తామని బీఆర్ఎస్ మణికొండ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. శుక్రవారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అర్జున్, రిత్విక్, దివ్యాన్ష్‌లు క్రీడా సామాగ్రి, సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలతో మంచి స్నేహ సంబంధాలు, శారీరక దారుఢ్యం ఏర్పడుతుందన్నారు. తమ పాఠశాల విద్యార్థులు చదువులో మండలంలోనే మొదటి స్థానంలో నిలవటంతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారన్నారు. తమ విద్యార్థిని సాత్విక నిహారి 600, 300 మీటర్ల అండర్–14 లాంగ్ జంప్‌లో పతకాలు సాధించిందని ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ తెలిపారు.

ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో శుక్రవారం రేణుక ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

క్లౌడ్ టెక్నాలజీపై దృష్టి పెట్టాలి

పటాన్‌చెరు టౌన్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, వెబ్ డిజైనింగ్, రెజ్యూమ్ తయారీపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ... కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం క్లోప్రోసిస్ ఐటి సర్వీసెస్ సీఈవో శ్రీ అమీర్ మాట్లాడుతూ... ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ కన్నా మానవ మేధాశక్తి ఎంతో గొప్పదని విద్యార్థులు క్లౌడ్ టెక్నాలజీపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ విభాగాధిపతి డా.సురేష్‌కుమార్, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ హోర్డింగులను తొలగిస్తాం


మున్సిపల్ కమిషనర్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్


హోర్డింగుల తొలగింపు

హైడ్రా కమిషనర్ రంగనాథ్

శంషాబాద్: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న హోర్డింగులను తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీలో ఉన్న అక్రమ హోర్డింగులను శుక్రవారం ఉదయం హైడ్రా తొలగించే ప్రక్రియను చేపట్టింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న హోర్డింగులపై చర్యలు తీసుకునే అధికారం హైడ్రాకు ఉందన్నారు. ఇందులో భాగంగానే ఔటర్ లోపల ఉన్న అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఉన్న అక్రమ హోర్డింగులను తొలగిస్తున్నామన్నారు. ఎలాంటి అనమతులు లేకుండా హోర్డింగులు ఏర్పాటు చేసుకుని డబ్బులు సంపాదిస్తున్నట్లు గుర్తించామన్నారు. అంతేకాకుండా ఒక హోర్డింగుకు అనుమతి తీసుకుని అనేక హోర్డింగులు ఏర్పాటు చేసుకున్న వారు కూడా ఉన్నారన్నారు. దీంతో ప్రభుత్వం పాలసీ ప్రకటించినా కొందరు అనధికారికంగా ప్రకటనలు వేస్తున్న విషయం కూడా ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత తీసుకుని ముందుకెళ్తామన్నారు. పట్టణంలో ఉన్న అన్ని అక్రమ హోర్డింగుల తొలగింపు చేపడతామన్నారు.

ముందే చెప్పిన 'సాక్షి'...

ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ శంషాబాద్ మున్సిపాలిటీలో అక్రమ హోర్డింగులు భారీగా కొనసాగుతున్న విషయంపై గతంలో 'సాక్షి' దినపత్రిక వెలుగులోకి తీసుకొచ్చిన విషయం పాఠకులకు విదితమే.

'అక్రమ హోర్డింగులతో ఖజానాకు గండి' అనే శీర్షికన డిసెంబర్‌లో 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది.

థీమ్‌పార్కు పనులు చకచకా..

త్వరలో అందుబాటులోకి

శేరిలింగంపల్లి: 'థీమ్' పార్కు పనులు చకచకా సాగుతున్నాయి. ఇప్పటికే తొంభైశాతం పనులు పూర్తి కాగా మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేసేలా జీహెచ్‌ఎంసీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నగర శివారులో ప్రజలకు ఆహ్లాదపూరిత వాతావరణంతో కూడిన 'థీమ్' పార్కు అందుబాటులోకి రానుంది. నల్లగండ్ల హుడా కాలనీలో నవంబర్- 2022 సంవత్సరంలో ఇలూజన్ థీమ్ పార్కు నిర్మాణానికి పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. 4 ఎకరాల స్థలంలో రూ.2.60 కోట్ల వ్యయంతో ఈ థీమ్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. పార్కు గేటు, ఆర్చ్ నిర్మాణం, గజీబో పైన రూఫ్ ఏర్పాటు, టాయిలెట్ నిర్మాణం వంటివి చేయాల్సి ఉంది. హుడా కాలనీతో పాటు సాయిరాం కాలనీ, సైబర్ ఎన్‌క్లేవ్, డైమండ్ హైట్స్‌తో పాటు అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ వాసులకు ఉపయుక్తం. ఇలూజన్ థీమ్ పార్కులో సైకిల్, వాకింగ్ ట్రాక్ , ప్రహరీ నిర్మాణం పూర్తి కాగా చిల్డ్రన్ ప్లే ఏరియాకు మెరుగులు దిద్దుతున్నారు.


నల్లగండ్ల హుడా కాలనీలోని ఇలూజన్ థీమ్ పార్కులో వాకింగ్ ట్రాక్



నల్లగండ్ల హుడా కాలనీ థీమ్ పార్కులో నిర్మాణంలో ఉన్న గజీబో, ఓపెన్ ఆడిటోరియం దృశ్యాలు

రెండు నెలల్లో పూర్తి చేస్తాం..



నల్లగండ్ల హుడా కాలనీలో చేపట్టిన ఇలూజన్ థీమ్ పార్కు పనులను రెండు నెలల్లో పూర్తి చేస్తాం. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. పనులను పూర్తి చేసేందుకు ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ అధికారుల అనుమతి కోసం ప్రాసెసింగ్ చేశాం. అనుమతులు రాగానే పనులు చేపట్టి పూర్తి చేస్తాం.

– రషీద్, ఏఈ, శేరిలింగంపల్లి సర్కిల్

అందరికీ మేలు

త్వరలో థీమ్ పార్కు అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్, పిల్లలకు ఎంతో ఉపయుక్తం. వ్యాయామం, సైక్లింగ్ చేసేందుకు వాకర్స్‌కు ఎంతో మేలు. చుట్టుపక్కల కాలనీల్లో పార్కులు లేకపోవడంతో ఇది ప్రాధాన్యత సంతరించుకోవడం ఖాయం.

– మంత్రిప్రగడ సత్యనారాయణరావు, అధ్యక్షులు, నల్లగండ్ల హుడా కాలనీ